పచ్చిరొట్ట ఎరువులు కలిపి దున్నాలి

మైలవరం: పచ్చిరొట్ట ఎరువులు జనుము, జీలుగ, పిల్లిపెసర నేలలో వేసి కలియదున్నడంతో నేలలో సేంద్రియ కర్బనం పెరుగుతుందని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు మోనీషా తెలిపారు. స్థానిక ఆర్బీకేలో రైతులకు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మొక్కజొన్న పంటలో వచ్చే కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ మందును రెండు మిల్లీ లీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏఓ సంధ్యారాణి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో లక్ష్మీ నరసింహాస్వామి వ్రతం

గంపలగూడెం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా నాల్గోవ రోజు బుధవారం గంపలగూడెం, పెనుగొలను రామాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంపలగూడెం రామాలయంలో సామూహిక శ్రీలక్ష్మీ నరసింహా స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు.

ఆరోగ్యశ్రీ పరిధి పెంపుపై ప్రజల హర్షం


ఇబ్రహీంపట్నంలో డీఎంహెచ్ఓ నుంచి ఆరోగ్యశ్రీకార్డు అందుకుంటున్న ఏడుకొండలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం సేవలను రూ. 25 లక్షలకు పెంచడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని ఐదో సచివాలయం పరిధిలోని భీమ్‌రాజ్‌గుప్తా నగర్‌లో 54 సంవత్సరాల మహిళ బాతుల ఏడుకొండలుకు కార్డులు అందచేసినట్లు తెలిపారు కార్డును అందుకుంటూనే కన్నీళ్లు పెట్టుకున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. తమ కోసం రూ.25 లక్షలు విలువగల వైద్యం అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కార్డును ఇవ్వడంతో కన్నీరు వచ్చిందని ఆమె పేర్కొన్నట్లు డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. ఇలా ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. అంతేకాకుండా చికిత్స అనంతరం విశ్రాంతి సమయంలో రోజుకు రూ.225, నెలకు రూ.5 వేలు ఆసరా కింద పొందేలా అందరికీ తమ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై అవగాహన

ఊటుకూరు/కొణిజెర్ల(గంపలగూడెం): పార్లమెంట్, శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం మండలంలోని రెండు గ్రామాల్లో బుధవారం ఓటర్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఊటుకూరు, కొణిజెర్లలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి ఈవీఎంలు, వీవీ ప్యాడ్స్ పనిచేసే విధానాన్ని వివరించారు.

ఆర్కే కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు


ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): స్థానిక ఆర్కే కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. సెకండ్ ఇయర్ విద్యార్థులు ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు స్నేహభావంతో నడిచి ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు.

అక్రమంగా రవాణా చేస్తున్న రబ్బిష్ లారీల పట్టివేత

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు, తాడేపల్లి, వేమవరం గ్రామాల నుంచి రాత్రివేళల్లో అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న రబ్బిష్ లారీలను విజయవాడ రూరల్ మండల తహసీల్దారు కె.లక్ష్మి బుధవారం అదుపులోకి తీసుకున్నారు. కొత్తూరు తాడేపల్లిలో ఏర్పాటు చేసిన మైనింగ్ చెక్ పోస్టువద్ద తనిఖీలు చేస్తుండగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న లారీలను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్టు తహసీల్దారు తెలిపారు.

దుర్గమ్మ సేవలో కార్మిక, పరిశ్రమల శాఖ కార్యదర్శి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎం.హరిజవహర్‌లాల్ బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన హరిజవహర్‌లాల్ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఈఓ కె.ఎస్.రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.

అమర జవాన్ల కుమార్తెలకు ల్యాప్‌టాప్‌ల వితరణ

విజయవాడస్పోర్ట్స్: యుద్ధంలో అమరులైన జవాన్ల కుమార్తెలకు అధర్వ ఫౌండేషన్ సభ్యులు ప్రొఫెసర్ సందీప్ గొండే, ప్రొఫెసర్ బాలాజీ షిండే ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. అధర్వ ఎడ్యుకేషన్ ట్రస్ట్, అధర్వ ఫౌండేషన్ చైర్మన్, బోరవాలి(ముంబై) శాసన సభ్యుడు సునీల్ రాణే సమకూర్చిన ల్యాప్‌టాప్‌లను విజయవాడలోని సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో వారు బుధవారం అందజేశారు. యుద్ధంలో అమరులైన ఐదుగురు జవాన్ల కుమార్తెలకు ఒక్కొక్కరికి ఒక్కో ల్యాప్‌టాప్‌ను అందజేయడం పట్ల బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఫౌండేషన్ దేశభక్తి స్ఫూర్తిని కొనియాడారు. సైనిక కుటుంబాల తరుపున ఫౌండేషన్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 22న విశాఖపట్నంలో మరో ఐదుగురికి ఇదే విధంగా ల్యాప్‌టాప్‌లను అందజేస్తామన్నారు.

నేడు రక్తదాన శిబిరం

తిరువూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం తిరువూరులో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ యువజన విభాగం తెలిపింది. తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో ఈ శిబిరం ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే రక్షణనిధి తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహనరెడ్డి పుట్టినరోజు వేడుకలలో పాల్గొన్న అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారని, అభిమానులు, కార్యకర్తలు రక్తదానం చేయాలని కోరారు.

పేదలకు సేవ చేయడంలోనే ఆనందం


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న కోయ సుధ, రమేష్, మాధవి

మైలవరం: పేదలకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందం, సంతృప్తి ఉన్నాయని మదర్‌థెరీసా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ తెలిపారు. మైలవరం బైపాస్ రోడ్డులోని జంగాల కాలనీలో పేదలకు పాత దుస్తులు బుధవారం పంపిణీ చేశారు. సర్వీస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు వంగూరు రమేష్‌బాబు, మాధవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి


పట్టాలు పొందిన లబ్ధిదారులతో తహసీల్దార్ శ్రీనివాసరావు, సర్పంచ్ దేవమాత, నాయకులు

జూపూడి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. జూపూడిలో లంక భూముల లబ్ధిదారులకు సర్పంచ్ కాకి దేవమాత, వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మతో కలిసి బుధవారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతిగా అభివృద్ధి సంక్షేమంతో పాటు శాశ్వత పథకాలుగా జగనన్న ఇళ్ల స్థలాలు, ఓటీఎస్‌తో ఇంటి రిజిస్ట్రేషన్‌లు, లంక భూముల పట్టాలు మంజూరు చేశారన్నారు. లంకభూముల పట్టాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆత్మగౌరవం పెరుగుతుందన్నారు. దశాబ్దాలుగా ఎటువంటి హక్కులు లేని భూములకు పట్టాలు మంజూరుతో స్థిరాస్తులు కల్పించినట్లు పేర్కొన్నారు. జూపూడిలో 254 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పట్టాలు అందజేశామని పేర్కొన్నారు. లంక పట్టాలకు అన్ని హక్కులు ఉంటాయన్నారు. ఏపీఓ మాధవరెడ్డి మాట్లాడుతూ లంక భూముల్లో పట్టాలు పొందిన రైతులు ఉపాధిహామీ పథకంలో 18రకాల పండ్ల తోటలు, పశుగ్రాసం, మునగ తోటలు వందశాతం సబ్సిడీతో సాగు చేపట్టవచ్చన్నారు. ఆసక్తిగల రైతులు సచివాలయంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, దుర్గగుడి కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు, గ్రీనరీ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ రాణి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకరరావు, పంచాయతీ కార్యదర్శి అనీల్, ప్రధానమంత్రి మత్స్యకార యోజన జిల్లా డైరెక్టర్ గోవిందరాజు. అంకమోహనరావు, కే.కొండలరావు, దయాకర్, ప్రకాశ్, రాధ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర


జూపూడిలో డ్రోన్‌ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జూపూడి(ఇబ్రహీంపట్నం): వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం జూపూడి గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ కాకి దేవమాత అధ్యక్షతన బుధవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈటీపీఆర్ మనోజ్‌కుమార్ అమలవుతున్న సంక్షేమ పథకాలు తెలియజేశారు. వ్యవసాయంలో రైతులు యాంత్రీకరణ పద్ధతులు పాటించాలని అందుకు అవసరమైన పరికరాలు సబ్సిడీపై పొందొచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ గొర్రెని గాంధీ, వార్డు సభ్యుడు కృష్ణ, బి.బాలాజీ పాల్గొన్నారు.

ఎల్బీఆర్‌సీఈలో ఫ్రీ కాన్ఫరెన్స్ ట్యుటోరియల్స్

మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ, ఏఐ, డీఎస్, ఐటీ సంయుక్త ఆధ్వర్యంలో కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్, నెట్‌వర్క్స్, సెక్యూరిటీ (ఐసీసీఐఎన్ఎస్) అనే అంశాలపై ఐసీసీఐఎన్ఎస్-2023 ప్రీ కాన్ఫరెన్స్ ట్యుటోరియల్స్‌ను గురువారం నుంచి నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు బుధవారం తెలిపారు. ఈ వర్క్‌షాపునకు మైక్రోసాఫ్ట్ ఇండియా డెవెలప్‌మెంట్ సెంటర్‌లో సీనియర్ అప్లెడ్ సెంటిస్ట్ డాక్టర్ తుషార్ సెంవాల్, కాంటినెంటల్ అనే అంతర్జాతీయ సంస్థలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ విభాగం చీఫ్ నహర్ సింగ్ వక్తలుగా వ్యవహరిస్తారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

23న వైకుంఠ ఏకాదశి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారు ఉత్తర ముఖంగా భక్తులకు దర్శనమివ్వనుండటంతో ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే స్వామికి అభిషేకాల అనంతరం దర్శనానికి అనుమతిస్తామన్నారు. స్వామిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు దక్షిణావృత శంఖంతో తీర్థం ఇవ్వనున్నారు. సాయంత్రం స్వామి నగరోత్సవ సేవ నిర్వహిస్తారు.

అట్టహాసంగా సీఎం జన్మదిన వేడుకలు




ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ఎమ్మెల్సీ, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం ఆధ్వర్యంలో గొల్లపూడి గ్రామంలో బుధవారం నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ట్రాలీపై భారీ కేక్‌ను ఏర్పాటు చేసి మైలురాయి సెంటర్ నుంచి గొల్లపూడి పంచాయతీ కార్యాలయం వద్దకు ర్యాలీ చేపట్టారు. అధిక సంఖ్యలో పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నంది నాటకోత్సవాలకు క్రాంతి హైస్కూల్ నాటిక


నంది నాటకోత్సవాలకు ఎంపికైన తథాబాల్యం నాటికలో దృశ్యం (ఫైల్)

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నంది నాటకోత్సవాలకు కొండపల్లి క్రాంతి హైస్కూల్ నాటిక 'తథాబాల్యం' ఎంపికైంది. ఈ మేరకు రాష్ట్ర నంది అవార్డ్స్ సంస్థనుంచి ఆహ్వానం అందింది. సెప్టెంబర్ 14న స్థానిక ఏకాలనీ ఆడిటోరియంలో నిర్వహించిన నాటికల స్క్రూటినీలో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు నాటికలు నిలవగా అందులో క్రాంతి కాన్వెంట్ విద్యార్థుల నాటిక తథాబాల్యం ఒకటిగా నిలిచిందని పాఠశాల కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీమోహన్ తెలిపారు.

వైభవంగా ప్రారంభమైన సప్తాహం


మేడూరులో ప్రారంభమైన సప్తాహ మహోత్సవం

మేడూరు(గంపలగూడెం): గంపలగూడెం మండలం మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో హరేరామ నామ సప్తాహ మహోత్సవాలు బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు రామచంద్రచార్యులు, అర్చక బృందం ప్రారంభించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రామకృష్ణ, ఆలయ మేనేజర్ జన్న వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై ఆసక్తి పెంచుకోవాలి

నూజివీడు: విద్యార్థి దశ నుంచే నూతన ఆవిష్కరణపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని గొల్లపల్లి హైస్కూల్ హెచ్ఎం పొట్లూరి రాధికారాణి అన్నారు. నూజివీడు మండలం గొల్లపల్లి హైస్కూల్లో బుధవారం పాఠశాల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు చేసిన పలు సైన్స్ ప్రాజెక్టులను హెచ్ఎం పరిశీలించి విద్యార్థులను అభినందించారు.



పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

నూజివీడు: ప్రేమ వివాహం చేసుకున్న తమకు పెద్దల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ప్రేమ జంట బుధవారం నూజివీడు రూరల్ పోలీసులను ఆశ్రయించారు. నూజివీడు మండలం మొర్సపూడికి చెందిన ఇర్షాద్, బీబీఏ, ఆయేషా ఎంబీఏ చదివారు. వీరు మూడేళ్లుగా ప్రేమించుకుంటూ మంగళగిరిలో వివాహం చేసుకున్నారు. పెళ్లి కుమార్తె కుటుంబ సభ్యులకు ఇష్టం లేకపోవడంతో దంపతులు రూరల్ ఎస్సై రామకృష్ణను ఆశ్రయించారు.

పంట నష్టం జాబితాల ప్రదర్శన

నూజివీడు: తుపానుతో దెబ్బతిన్న పంటల జాబితాలను మండలంలోని అన్ని ఆర్బీకేల వద్ద ప్రదర్శించినట్లు ఏఓ చాముండేశ్వరి తెలిపారు. 961 మంది రైతులకు సంబంధించి 845 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు.

రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక 3, 4 వార్డుల్లోని పేదలకు మంజూరైన వైఎస్సార్ స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను బుధవారం ఆయన సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్డు ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం పొందవచ్చన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో, ఇప్పుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ దయాల ఆశా, మున్సిపల్ వైస్ చైర్మన్లు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రాము, కౌన్సిలర్ తుమ్మూరు మౌనిక, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు పిళ్లా చరణ్, నాయకులుమున్నీ, రవితేజ, వైద్యులు సౌమ్య, సురుచి పాల్గొన్నారు.



నూజివీడులో ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు

రేపు టెన్నీకాయిట్ ఉమ్మడి కృష్ణా జిల్లా జట్ల ఎంపిక

నూజివీడు: స్థానిక ఎస్ఆర్ఆర్ జెడ్పీ హైస్కూల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా పురుషుల, మహిళల టెన్నికాయిట్ జట్ల ఎంపిక ఈనెల 22న నిర్వహించనున్నారు.



పథకాలతో గడప గడపలోనూ సంతోషం

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో గడప గడపలోనూ సంతోషం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు పట్టణంలోని 25వ వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు శీలం రాము, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌రషీద్, క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు చరణ్ పాల్గొన్నారు.



లేగ దూడలను సంరక్షించుకోవాలి

చాట్రాయి: లేగ దూడలను సంరక్షించుకోవాలని పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. నరసింహారావుపాలెంలో బుధవారం పశు పోషకులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ ప్రశాంతి, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖరరావు, మండల పశు వైద్యాధికారి శివనాగేంద్రబాబు పాల్గొన్నారు.





జగనన్న పాలన దేశానికి ఆదర్శం

ఆగిరిపల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు తెలిపారు. వట్టిగుడిపాడులో బుధవారం ఏపీకి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నరసింహారావు, జిల్లా కార్యదర్శి హరిబాబు, సర్పంచ్ కిరణ్మయి పాల్గొన్నారు.

విద్యార్థులు రాణించాలి

ముసునూరు: సాంకేతిక విద్య సముపార్జనలో విద్యార్థులు రాణించాలని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ అన్నారు. ముసునూరు హైస్కూల్లో హెచ్ఎం సునీల అధ్యక్షతన బుధవారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు.







